పడకేసిన పురపాలన

- వానొస్తే రోడ్లన్నీ మురుగునీటిమయం
- వీధుల్లో దర్శనమిస్తున్న చెత్తకుప్పలు
- ప్రజారోగ్యంపై పాలకవర్గం నిర్లక్ష్యం
- ప్రజలకు తప్పని తిప్పలు


కృష్ణాపురం జీరో రోడ్డులో నిలిచిన వర్షపు నీరు


అండర్ డ్రైనేజీ ఉప్పొంగి, వర్షపు నీరు చేరికతో మడుగులా మారిన చర్చి సర్కిల్

తాడిపత్రి: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా తాడిపత్రి మున్సిపాలిటీ తయారైంది. ఎక్కడ చూసినా పొంగి పొర్లుతున్న అండర్ డ్రైనేజీ మ్యాన్ హోల్స్, వీధుల్లో తొలగించని చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. తమ పనితనానికి నిదర్శనంగా మున్సిపాలిటీకి అవార్డులు వచ్చాయి అని చెప్పుకునే చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కేవలం రాజకీయం చేయడమే ధ్యేయంగా పెట్టుకుని ప్రజారోగ్యాన్ని గాలికి ఒదిలేశారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా అండర్ డ్రైనేజీని ఏర్పాటు చేశామని గొప్పలు చెప్పుకునే జేసీ, వాటి నిర్వహణపై ఏ మాత్రం దృష్టి పెట్టకపోవడంతో పట్టణంలోని ప్రతి వీధి మురికికూపంగా మారింది. మ్యాన్ హోల్స్ నుంచి మురుగునీరు బయటకు వచ్చి రోడ్లపై పారుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జేసీ నోటి దురుసు చూసిన పట్టణ ప్రజలు పారిశుధ్య సమస్యపై ఫిర్యాదు చేసేందుకు సాహసించడం లేదు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా, పట్టణంలోని పలు వీధులు మురికి కూపాలుగా మారుతున్నా అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోగా నేరుగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి విన్నవించుకుంటున్నారు. దీంతో ఆయన చొరవతో ఆయా వార్డుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయా పనులను చక్కబెడుతూ, ప్రజలకు కాస్త స్వాంతన చేకూరుస్తున్నారు.

విచ్ఛిన్నమైన మురుగునీటి వ్యవస్థ....

పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా భూగర్భ మురుగు నీటి పారుదల వ్యవస్థను ఏర్పాటు చేయడంలో అప్పటి పాలకవర్గం పూర్తిగా విఫలమైంది. అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసిన అనంతరం ఓపెన్ డ్రైనేజీని పూర్తిస్థాయిలో పూడ్చివేశారు. వర్షపు నీరు వెళ్లేందుకు దారిలేక మ్యాన్ హోల్స్‌లో వర్షపు నీరుతో పాటు ఇసుక, బంక మన్ను చేరి మురుగు నీటి పారుదల వ్యవస్థకు తరచూ తీవ్ర అంతరాయం కలుగుతోంది. అంతేకాకుండా అనేక రకాల వ్యర్థాలను కొంతమంది మురుగునీటిలో వదలడంతో భూగర్భ మురుగు నీటి ప్రవాహానికి తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. సుంకులమ్మ పాలెం అన్నపూర్ణ థియేటర్‌కు వెళ్లే దారిలో, హరిజన వాడ, అంబేద్కర్ నగర్, కృష్ణాపురం జీరో రోడు, నాలుగో రోడ్డు తదితర ప్రాంతాల్లో మురుగు నీరు ఎప్పుడూ రోడ్డుపైనే ఉంటోంది. అలాగే వర్షం కురిసినప్పుడల్లా పై కాలనీలతో పాటు చర్చి సర్కిల్, చేపల మార్కెట్ వద్ద, నంబర్‌వన్ పెట్రోల్ పంప్ ఎదురుగా, సాయి తేజ థియేటర్ ఎదురుగా, నంద్యాల రోడ్ తదితర ప్రాంతాల్లోని ప్రధాన రహదారులతో పాటు సీబీ రోడ్ వెంబడి పలు ప్రాంతాల్లో, వివిధ కాలనీల్లో వర్షపు నీరు చెరువులను తలపిస్తుంటాయి. ఇక చెత్తను తీసుకెళ్లే వాహనాలు అడ్రస్ లేదు. వారానికి ఒకసారి వచ్చి చెత్తను సేకరించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక మ్యాన్ హోల్ నుంచి తీసిన పూడికను ఆలస్యంగా తరలిస్తుండటంతో తిరిగి ఆ పూడిక మ్యాన్‌హోల్స్‌లోకి చేరుతోంది. హ్యాన్‌హోల్స్‌లో ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్తను కనీసం నెలకు ఒక మారు తీసిన పాపాన పోలేదు. ఫలితంగా పట్టణ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

అసలు ఏం జరుగుతోంది....

పట్టణంలో దాదాపు 31 వేల గృహాలున్నాయి. 1.30 లక్షల జనాభా ఉంది. 2009లో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఐదేళ్ల వరకూ నిర్వహణ బాధ్యతను నిర్మాణ సంస్థ చేపట్టింది. అనంతరం మున్సిపాలిటీ చేపట్టాలి. అప్పటి నుంచి నిర్వహణను మూలన పడేశారు. మురుగునీరు పైపుల ద్వారా ఊరి బయట ఉన్న ఎస్‌టీపీ (సివిరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) లోకి వెళ్లి మురుగు నీటి గాఢతను తగ్గించి ఇతర అవసరాలకు వినియోగించేలా చూడాలి. ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా మారింది. మురుగునీటి ప్రవాహాన్ని తట్టుకునే సామర్థ్యం గల పైపులు లేకపోవడంతో పగిలిపోయి మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు నీరు బయటకు వస్తోంది. అంతేగాక పట్టణంలో బయటకు వచ్చే మురుగు నీటి సామర్థ్యానికి తగ్గట్టుగా ఎస్‌టీపీల నిర్మాణం జరుగలేదు. ఈ లోపాలను సరిదిద్దేందుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అవసరమైన నిధులు మంజూరుకు కృషి చేశారు. అవగాహనలోపంతో భూగర్భ మురుగునీటి వ్యవస్థ పనులు నిర్వహించి ప్రజాధనం దుర్వినియోగానికి పాల్పడి పాపాన్ని మూటగట్టుకున్న జేసీ పశ్చాత్తాపపడాల్సింది పోయి, మరమ్మతు పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్లపై దౌర్జన్యాలకు దిగుతున్నారు. మున్సిపల్ చైర్మన్ జేసీ తీరుతో పట్టణం మురికికూపంగా మారుతోంది. ఇప్పటికే దోమలు కాటుకు గురై పలువురు మలేరియా, టైఫాయిడ్, విషజ్వరాలతో వైద్యానికి రూ.వేలు ఖర్చు చేసి ఆర్థికంగా చితికిపోయారు. అభివృద్ధికి తానే అంబాసిడర్ అని గొప్పలు చెప్పడమే తప్ప జేసీ చేసిందేమీ లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

క్లుప్తంగా

కంటి వైద్యశిబిరం


కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రోటరీ హైస్కూల్ ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కర్నూల్ సన్‌షైన్ ఆస్పత్రికి చెందిన వైద్యులు 120 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కంటిచూపు మందగించిన, కంటి జబ్బులతో బాధపడుతున్న 40 మందికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ కార్యదర్శి శివానంద, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రేణుక, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఆదివారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. 14, 16, 19, 21వ వార్డుల్లో పారిశుధ్య కార్మికులు మురికి కాలువలను శుభ్రం చేశారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు.

28న మెగా రక్తదాన శిబిరాలు



ఫ్లెక్సీలను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ ఖాజీ రజాక్‌పీర్ సాహెబ్

గుంతకల్లుటౌన్: మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకుని ఈ నెల 28న రెడ్‌డ్రాప్ బ్లడ్ డోనర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని మూడు ప్రాంతాల్లో మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఖాజీ అబ్దుల్ రజాక్ పీర్ సాహెబ్ తెలిపారు. ఆదివారం భాగ్యనగర్‌లోని మదరసాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రక్తదాన శిబిరాలకు సంబంధించిన ఫ్లెక్సీలను ఆయన ఆవిష్కరించారు. మున్సిపల్ ఆఫీస్, ఆర్‌అండ్‌బీ సర్కిల్, పాత గుంతకల్లు మస్తాన్‌వలి దర్గా ఆవరణలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరాలు నిర్వహిస్తామన్నారు. యువకులు, ఉత్సాహవంతులు రక్తదానం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మతపెద్దలు మన్సూర్ అలీసాహెబ్, రెడ్‌డ్రాప్ వ్యవస్థాపకుడు రెహమాన్, పట్టణాధ్యక్షుడు గులాం మహమ్మద్, ప్రధాన కార్యదర్శి షఫీ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ట్రాక్టర్

యాడికి: మండలంలోని వేములపాడు రహదారిపై అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం తాడిపత్రి మండలం గంగాదేవిపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ పెన్నానది నుంచి ఎటువంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండటంతో పట్టుకున్నామన్నారు. లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు.చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, 108 శివలింగాలను దర్శించుకొని మొక్కులు తీర్చుకు న్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఆదివారం పంచామృతాభిషేకాలు చేశారు. స్వామిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి, పూజలు చేశారు. ఆలయంలో ఆకుపూజ , కాలసర్పదోష రాహుకేతు హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మంజునాథస్వామి, పార్వతీదేవికి పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పబ్లిక్ టాయిలెట్ ఏర్పాటుపై అభ్యంతరం


టాయిలెట్ నిర్మాణంపై వాదించుకుంటున్న కమిషనర్, ఆస్పత్రి సూపరింటెండెంట్

గుంతకల్లుటౌన్: ప్రజా అవసరాల దృష్ట్యా మెయిన్ రోడ్డులోని ప్రభుత్వాస్పత్రి సమీపంలో నిర్మించనున్న పే యూజ్ పబ్లిక్ టాయిలెట్ నిర్మాణ పనులపై వివాదం నెలకొంది. ఆదివారం ఉదయం మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు షురూ చేయించిన నిర్మాణ పనులను ఆపివేయాలంటూ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్, సమీపంలోని కూరగాయల వ్యాపారస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, టీపీఎస్ అబ్దుల్ సత్తార్ అక్కడికి చేరుకుని ప్రజా అవసరాల దృష్ట్యా మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం మేరకే పట్టణంలోని మెయిన్‌రోడ్డులో పలు చోట్ల పబ్లిక్ టాయిలెట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా మున్సిపాలిటీకి చెందిన రోడ్డుపై టాయిలెట్లు నిర్మిస్తామంటే అభ్యంతరం తెలపడం సరికాదంటూ ఆస్పత్రి అధికారులకు సూచించారు. దీంతో అధికారుల మధ్య పరస్పర వాదనలు జరిగాయి. కూరగాయల వ్యాపారస్తుల తరఫున వామపక్ష నాయకులు కూడా నిర్మాణ పనులు అడ్డుకోవాలని యత్నించారు. అయితే చిరువ్యాపారస్తులకు ప్రత్యామ్నాయంగా స్థలం చూయిస్తామని చెప్పడంతో వివాదం సద్దుమణిగినట్లు తెలిసింది.

ఘనంగా వృద్ధుల ఆరాధన

పామిడి: స్థానిక సీఎస్‌ఐ చర్చిలో ఆదివారం వృద్ధుల ఆరాధన ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దైవసేవకుడు పరదేశి విజయశేఖర్‌రాజు మాట్లాడుతూ దేవుడు ముదిమి వచ్చు వరకు మనలను ఎత్తుకొని రక్షించేవాడన్నారు. దేవుని సాక్ష్యకరమైన జీవితం గల వృద్ధుల వల్ల మనకు ఆశీర్వాదాలు, దీవెనలు ఉంటాయన్నారు. వృద్ధులను గౌరవించాలన్నారు. తల్లిదండ్రులను సన్మానించువాడు దీర్ఘాయుష్మంతుడవుతారన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, వీరయ్య, జయరాజు, ఆనంద్‌రాజ్, అబ్రహాం, లక్ష్మినారాయణ, కరుణాకర్, ప్రసాద్, రజని, మంజుల, ప్రిస్కిల్లా, జయామణి, రేచెల్, మాణిక్యమ్మ, కీర్తిమణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో కేశవరెడ్డి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు. గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన కేశవరెడ్డి తొండపాడు గ్రామంలో తమ బంధువుల వివాహానికి వచ్చాడు. కల్యాణమండపం వద్దకు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో కేశవరెడ్డి తలకు బలమైన గాయమైంది. గమనించిన స్థానికులు వెంటనే అతడిని గుత్తి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో పోస్టాఫీసు వద్ద నిచ్చెనపైకి ఎక్కి డిష్ వైర్ రిపేరి చేస్తుండగా ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. డిష్ నిర్వాహకుడు చంద్రబాబు విద్యుత్ స్తంభానికి నిచ్చెన వేసి పైకి ఎక్కి డిష్ వైర్ రిపేరి చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆటోలో నుంచి జారి పడి..

గుత్తి: పట్టణంలోని ఆర్‌ఎస్ రోడ్డులో ఆదివారం ఆటోలో నుంచి ధనుంజయ అనే వ్యక్తి జారి కింద పడి గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే తుగ్గలి గ్రామానికి చెందిన ఆటో గుత్తి నుంచి తుగ్గలికి వెళుతున్న సమయంలో వెనుక వైపు కూర్చున్న ధనుంజయ ఆటో కుదుపునకు గురి కావడంతో జారి కింద పడి గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే ఆటోలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

● చిత్రావతి చిందులు


యల్లనూరు వద్ద పొంగి ప్రవహిస్తున్న చిత్రావతి నది

యల్లనూరు: మండలంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు చిత్రావతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. వంకలు, వాగులు, చిన్నచిన్న కాల్వలు ద్వారా వచ్చిన నీటితో కళకళలాడుతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు వ్యవసాయ పంటలకు అనుకూలంగా మారాయి. బోరుబావుల్లో నీటిమట్టం పెరిగిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తోటల్లో వర్షపు నీరు చేరింది. వర్షపు నీటితో ఉరకలేస్తున్న చిత్రావతి నదిని చూసేందుకు జనాలు ఆసక్తి చూపారు. మండలంలో శనివారం 23.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

శింగనమల: శింగనమల నియోజకవర్గవ్యాప్తంగా శనివారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. శింగనమల మండలంలో 34.6 మి.మీ, పుట్లూరు 25.4 మి.మీ, గార్లదిన్నె 7.4 మి.మీ, బుక్కరాయసముద్రం మండలంలో 1.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఆశాజనకంగా సజ్జ


చందన గ్రామ సమీపంలో సాగు చేసిన సజ్జ పంట

యాడికి: ఈ ఏడాది ఖరీఫ్‌లో మొదటి పంటగా సాగు చేసిన సజ్జ మరో పది రోజుల్లో అన్నదాత చేతికి రానుంది. ఎలాంటి మందులు వాడకుండా పండించే పంటగా గుర్తింపు ఉన్న సజ్జ ఈ ఏడాది రైతన్నలకు సిరులు కురిపించనుంది. జూలైలో కురిసిన వర్షాలకు ప్రత్యామ్నాయ పంటగా సాగు చేసిన సజ్జ కంకులు విరగ్గాయడంతో అన్నదాతలు ఆనందంగా ఉన్నారు. ఏటా వేరుశనగ, ఆముదం, పత్తితో నష్టాలు మూటగట్టుకున్న కొందరు రైతులు ఈ సారి పంట మార్పిడికి మొగ్గు చూపారు. విత్తనం కొనుగోలు తప్ప ఎలాంటి పెట్టుబడులు లేకుండా పంట చేతికి వస్తుండటంతో సజ్జ రైతులు ధీమాగా ఉన్నారు. సజ్జ, కొర్ర పంటలకు ఎలాంటి రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడాల్సిన అవసరం లేకపోవడంతో వీటిని తినడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని రైతులు పేర్కొంటున్నారు. ఏటా నష్టాలు వస్తుండటంతో రైతులు వేరుశనగలో ప్రత్యామ్నాయ పంటగా సజ్జతో పాటు కంది సాగు చేశారు. మరో రెండు మూడు వర్షాలు వస్తే కంది మంచి దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా అంటున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సజ్జ దాదాపుగా 300 ఎకరాల్లో సాగు చేశారని, పంట ఆశాజనకంగా ఉందన్నారు. నెల రోజులుగా బెట్ట ఏర్పడిన నాలుగు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో సజ్జ ఏపుగా పెరిగి కంకి బాగా వచ్చినదని ఏఓ తెలిపారు.

భూముల రీ-సర్వేతో శాశ్వత పరిష్కారం


రైతులకు భూహక్కు పత్రాలు అందిస్తున్న దృశ్యం

పామిడి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష కార్యక్రమం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ ఆర్‌వీ సునితబాయి అన్నారు. ఆదివారం అప్పాజీపేట గ్రామంలో జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌తో పాటు వైఎస్సార్ సీపీ మండల రూరల్ కన్వీనర్ కే నారాయణరెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు మాట్లాడారు. భూముల రీ–సర్వేతో పొలంగట్లు, ఇతరత్రా తగాదాలు తొలగిపోతాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం రైతులకు ఎంతగానో దోహదపడుతోందన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రైతులకు జగనన్న శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జయప్ప, డిప్యూటీ తహసీల్దార్ జీ లక్ష్మీనారాయణరెడ్డి, ఆర్‌ఐ క్రాంతికుమార్, వీఆర్వో రమేష్, సర్వేయర్ నిరంజన్‌రెడ్డి, డీలర్ రామచంద్ర, రైతులు పాల్గొన్నారు.

నేడు యువ నాయకుడి పర్యటన

పెద్దపప్పూరు: ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ యువనాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి సోమవారం మండలంలోని అత్తిరాలదిన్నె, కుమ్మెత గ్రామాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్సార్‌సీపీ పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించనున్నారు.

సమస్యలు ఎవైనా ఉంటే స్థానికుల ద్వారా తెలుసుకుని అధికారుల ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నారు.

కాజ్‌వే రిపేరీకి మోక్షం


అశ్వత్థం కాజ్‌వే వద్ద మరమ్మతులు చేస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: మండలంలోని అశ్వత్థ నారాయణ స్వామి క్షేత్రం వద్ద పెన్నానదిపై ఉన్న కాజ్‌వేకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చొరవతో మోక్షం కలిగింది. రెండేళ్లలో పెన్నానది వర్షాలకు పలుమార్లు ఉధృతంగా ప్రవహించడంతో కాజ్‌వే అక్కడక్కడా దెబ్బతింది. ఇటీవల ప్రజా సంక్షేమ పాదయాత్రలో ఎమ్మెల్యే స్వయంగా కాజ్‌వేను పరిశీలించారు. కాజ్‌వే మరమ్మతుల కోసం రూ.34 లక్షల నిధులు మంజూరు చేయించారు. దీంతో రిపేరీ పనులు ప్రారంభమయ్యాయి. వాహనదారులు, పాదచారులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' సద్వినియోగం చేసుకోవాలి

అనంతపురం కార్పొరేషన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం 50వ డివిజన్ 68వ సచివాలయ పరిధిలోని అంధ బాలికల వసతి గృహంలోని అంధ బాలికలకు బీపీ, షుగర్, తదితర పరీక్షలు చేశారు. తమ వసతి గృహానికే వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించడం సంతోషంగా ఉందని అంధ బాలికలు తెలిపారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే వివిధ డివిజన్ల పరిధిలో హెల్త్ స్క్రీనింగ్ నిర్వహించి, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వృద్ధులు, మహిళలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించినట్లు తెలిపారు. ఈ నెల 30 నుంచి జరిగే హెల్త్ క్యాంపుల్లో వీరికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేస్తామని తెలిపారు.

సంతల ఆదాయం రూ.4.28 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఈ వారం పశువులు, జీవాల సంతల ద్వారా రూ.4.28 లక్షలకు పైగా ఆదాయం వచ్చింది. శనివారం గొర్రెలు, మేకల సంత నుంచి రూ.2,16,450, ఆదివారం పశువుల సంత నుంచి రూ.2,12,270 మేర వసూలైంది.

నేడు 'స్పందన'

గుత్తి రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మహబూబ్ బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభయ్యే కార్యక్రమంలో ఫిర్యాదు చేసే వారు తప్పకుండా ఆధార్, సెల్ ఫోన్ నంబర్ వేయాలని పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని తహసీల్దార్ సూచించారు.

యల్లనూరు: మండలస్థాయి అధికారులు స్పందన కార్యక్రమానికి హాజరుకావాలని తహసీల్దారు సుమతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియజేయాలని కోరారు.

బుక్కరాయసముద్రం: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రమాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో తెలియజేయవచ్చన్నారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు


అలంకరణలో ముసలమ్మ తల్లి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ప్రముఖ అమ్మవారి ఆలయాల్లో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని ముసలమ్మ కట్ట వద్ద వెలసిన ముసలమ్మ తల్లి, కాశీ విశ్వేశ్వర ఆలయంలో కాశీ విశాలాక్షి అమ్మవార్లకు మహిళలు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ముసలమ్మ తల్లి ఆలయంలో నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేపట్టారు.

పత్ర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు



గార్లదిన్నె: పత్ర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత చీమల శ్రీనివాసులు ఎంపికయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు శ్రీనివాసులు తెలిపారు. భవిష్యత్తులో పత్ర కులస్తులకు అందుబాటులో ఉండి సమస్యలపై పోరాటం చేస్తానన్నారు. తన ఎంపికకు సహకరించిన జిల్లా కార్యవర్గ సభ్యులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

బైబై.. గణేశా!


ట్రాక్టర్ నగర్‌లో వినాయకుడి ఊరేగింపు

గార్లదిన్నె: మండల పరిధిలోని ట్రాక్టర్‌నగర్‌లో ఏడోరోజు ఆదివారం వినాయక విగ్రహ నిమజ్జనం కోలాహలంగా సాగింది. తొలుత ట్రాక్టర్ నగర్ సిబ్బంది కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో వినాయకుడికి పూజలు చేశారు. అనంతరం ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ, డప్పువాయిద్యాల నడుమ వినాయకుడి విగ్రహాన్ని ఊరేగింపుగా గార్లదిన్నె మీదుగా తీసుకెళ్లి కెనాల్‌లో నిమజ్జనం చేశారు.

సేవాదృక్పథం అలవర్చుకోవాలి

అనంతపురం క్రైం: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలని అనంతపురం వన్ టౌన్ సీఐ రెడ్డప్ప అన్నారు. ఆదివారం పాతూరు స్వర్ణకారుల వీధిలో మిలాద్ ఉన్ నబీ (స్వ అల్లై)పండుగ సందర్భంగా సయ్యదా మాసుమా బీబీ సారా బీబీ దర్గా వద్ద కులమతాలకతీతంగా 12వ డివిజన్ వార్డు కార్పొరేటర్ జనబలం బాబా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సీఐ రెడ్డప్ప ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.

రక్తదాన శిబిరం

అనంతపురం టవర్‌క్లాక్: నగరంలోని సంగమేశ్వర కల్యాణమంటపంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మోదీ జన్మదిన వేడుకలను నిరాడంబరంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ చిరంజీవి రెడ్డి, శ్రీధర్, అశోక్‌రెడ్డి, కోనంకి శ్రీధర్, శివరుద్రయ్య, బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.